సాక్షి యాదాద్రి భువనగిరి

బుధవారం, 4, సెప్టెంబర్, 2024



అడుగుకో గుంత..
మోటకొండూర్ మండలంలో రోడ్లు కంకర తేలి, గుంతలు పడి, బురదమయమై కనిపిస్తున్నాయి.
- 9లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	: 585.90 అడుగులు
ఇన్‌ఫ్లో	: 2,39,236 క్యూసెక్కులు
క్రస్ట్‌గేట్లు	: 1,99,342 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 29,516 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 7,978 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: నిల్
ఏఎమ్మార్పీకి	: 1,800 క్యూసెక్కులు
వరద కాల్వకు	: 600 క్యూసెక్కులు

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం:	642.20 అడుగులు
ఇన్‌ఫ్లో	: 6,227 క్యూసెక్కులు
క్రస్ట్ గేట్లు	: 1,244 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: నిల్
కుడికాల్వకు	: నిల్

న్యూస్‌రీల్

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలి

భువనగిరిటౌన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాలకు (ఫ్రెష్ మరియు రెన్యువల్) దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి జయపాల్ రెడ్డి మంగళవారం తెలిపారు. డిసెంబర్ 31 వరకు గడువు ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు వారి బ్యాంక్ అకౌంట్ వివరాలు తప్పనిసరిగా ఆన్‌లైన్ లో నమోదు చేయాలని పేర్కొన్నారు. ఈ – పాస్ వెబ్‌సైట్ telangana.epass.cgg. gov.in ను సందర్శించాలని కోరారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆలేరురూరల్, రామన్నపేట: ఆలేరు పట్టణంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు, ఇంగ్లిష్, ఫిజిక్స్‌కు సంబంధించి గెస్ట్ లెక్చరర్ల నియామకానికి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజారాం నాయక్ మంగళవారం తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో 55 శాతం, ఉత్తీర్ణతతో పాటు పీజీ, ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం ఉత్తీర్ణత ఉండాలన్నారు. సెట్, నెట్ కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈనెల 5వ తేదీ 4.30 గంటలలోపు కళాశాలలో సమర్పించాలని తెలిపారు. అదేవిధంగా రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్, తెలుగు, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, కామర్స్ బోధించేందుకుగాను ఈనెల 6వ తేదీలోగాదరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రహత్‌ఖానం తెలిపారు.

జిల్లా రైతులకు ఉత్తమ అవార్డులు



ఉత్తమ రైతు పురస్కారం అందుకుంటున్న సిద్దారెడ్డి

భువనగిరి రూరల్: పత్తిలో అధిక సాంద్రత, వరి, కూరగాయల పంటల్లో ఉత్తమ యాజమాన్య పద్ధతులను పాటిస్తూ అధిక దిగుబడులు సాధించినందుకుగాను భువనగిరి మండలం చందుపట్ల గ్రామానికి చెందిన మందడి సిద్దారెడ్డి, రాజాపేట మండలం నెమిలె గ్రామానికి చెందిన మేక వెంకటేశ్వరరెడ్డి ఉత్తమ రైతు అవార్డులు అందుకున్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లోని కేంద్రియ విశ్వవిద్యాలయంలో వైస్ చాన్స్‌లర్ బీజే రావు వారికి అవార్డులు అందజేశారు.

ఆంజనేయస్వామికి ఆకుపూజ



ఆంజనేయస్వామికి హారతినిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట రూరల్: యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో మంగళవారం ఆంజనేయస్వామికి అర్చకులు ఆకుపూజను విశేషంగా నిర్వహించారు. ప్రధానాలయంతో పాటుగా, విష్ణుపుష్కరిణి వద్ద, పాతగుట్ట ఆలయంలో ఆంజేయస్వామిని సింధూరం, పాలతో అభిషేకించారు. అనంతరం తమలపాకులతో అర్చించారు. ఇక ప్రధానాలయంలో సుప్రభాత సేవ జరిపించారు. అనంతరం నిజాభిషేకం, తులసీదళాలతో అర్చన చేశారు. ప్రధానాలయ ముఖ మండపం ముందు సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. ప్రథమ ప్రాకార మండపంలో శ్రీ సుదర్శన నారసింహ హోమం , గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు జోడు సేవలను మాఢవీధుల్లో ఊరేగించారు. వివిధ విభాగాల ద్వారా స్వామి వారికి రూ.21,09,091 నిత్య ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

ఒక్కరోజు వేతనం విరాళం

నల్లగొండ : వరద బాధితులకు ఒక్కరోజు వేతనాన్ని విరాళంగా ఇస్తున్నట్లు తెలంగాణ సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పున్న సోమనాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 40 సంవత్సరాల్లో ఎప్పుడూ లేనంతగా వరద బీభత్సం సృష్టించిందని అందుకే సీపీఎస్ ఉద్యోగులంతా ఒక్కరోజు వేతనాన్ని విరాళంగా ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

హైడ్రా హడల్!

జిల్లాల్లోనూ హైడ్రా తరహా చర్యలు ఉంటాయని ప్రకటించిన సీఎం



భువనగిరి పెద్ద చెరువులో వెలిసిన వెంచర్

- ఆక్రమణకు గురైన చెరువులు, కుంటల లెక్కలు తేలుతాయంటున్న జిల్లా వాసులు
- హెచ్‌ఎండీఏలో మొత్తం చెరువులు 267
- 34 చెరువులు ఆక్రమణకు గురైనట్లు గుర్తించిన అధికారులు



రాయిగిరి తిమ్మబాయి కుంటలో చేసిన ప్లాట్లు

సాక్షి, యాదాద్రి: జిల్లాల్లో చెరువులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని, హైడ్రా తరహా వ్యవస్థను విస్తరిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఆయా జిల్లాల నుంచి హైడ్రా తరహా చర్యలు చేపట్టాలని వస్తున్న డిమాండ్ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో ఆక్రమణకు గురైన చెరువులు, కుంటలు, నాలాల లెక్కలు తేలుతాయని ప్రజలు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా.. చెరువులు, కుంటలు కబ్జా చేసి ప్లాట్లుగా విక్రయించిన కొందరు అక్రమార్కుల్లో భయం మొదలైంది.

ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో నిర్మాణాలు

హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్‌ఎండీఏ), వైటీడీఏ, గ్రామపంచాయతీల్లో చెరువులు, కుంటలు కనుమరుగయ్యాయి. రూ. కోట్ల విలువ చేసే చెరువులు, కుంటలు, కాలువల భూములు కబ్జా చేశారు. హెచ్‌ఎండీఏ పరిధిలోని భువనగిరి, భూదాన్ పోచంపల్లి, బీబీనగర్, చౌటుప్పల్ మండలాల్లో పలు చెరువుల ఆక్రమణకు గురయ్యాయి. చెరువులు ఫుల్ ట్యాంక్ లెవెల్ (ఎఫ్టీఎల్) లోపలికి వెళ్లి అక్రమ నిర్మాణాలు, వెంచర్లు ఏర్పాటు చేశారు. బీబీనగర్ పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలు, వెంచర్‌లు చేసి ప్లాట్ల విక్రయానికి శ్రీకారం చుట్టారు. ఇటీవల ఐదు మండలాల్లో 267 చెరువులను గుర్తించారు. వీటిలో అధికారులు చేపట్టిన సర్వే ప్రకారం.. 34 చెరువులు ఆక్రమణకు గురైనట్లు తేల్చారు.

ప్రాథమికంగా ఎఫ్‌టీఎల్ గుర్తించిన చెరువులు

మండలం	చెరువులు	ఎఫ్‌టీఎల్ నిర్ధారించినవి	మిగిలినవి
పోచంపల్లి	54	40	14
బీబీనగర్	36	35	01
భువనగిరి	86	72	14
ఐ.రామారం	54	53	01
చౌటుప్పల్	37	33	04

సీఎం ప్రకటనతో యంత్రాంగం అలెర్ట్

సీఎం ఆదేశాలతో జిల్లా యంత్రాంగం అలెర్ట్ అవుతోంది. కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలోని కుంటలు చెరువులు, నాలాల ఆక్రమణలను గుర్తించనున్నారు. రెవెన్యూ, నీటిపారుదల, హెచ్‌ఎండీఏ ఇంజనీర్లు, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు సంయుక్తగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నారు. అయితే గతంలో రెవెన్యూ, నీటిపారుదలశాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి చెరువుల శాటిలైట్ మ్యాప్‌లు, రెవెన్యూ రికార్డులతో పోల్చి చూసి ఎఫ్‌టీఎల్ నిర్ధారించారు. 34 చెరువుల్లో ఉన్న ఆక్రమణలు గుర్తించారు. కానీ ఒక్క చెరువులో కూడా ఆక్రమణలు తొలగించలేకపోయారు.

ఆక్రమణలో భువనగిరి పెద్ద చెరువు

భువనగిరి పెద్ద చెరువు ఆక్రమణలకు గురవుతోంది. 250 ఎకరాల ఎఫ్‌టీఎల్ నిర్ధారించిన చెరువులో ప్రతి సంవత్సరం నిర్వహించే బతుకమ్మ పండుగ కోసం ఏర్పాట్లు చేసే క్రమంలో చెరువు శిఖంలో మట్టిపోస్తున్నారు. అదేవిధంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోకి చొచ్చుకు వచ్చి నిర్మాణాలు చేపట్టారు. జగ్‌దేవ్‌పూర్ రోడ్డు వైపు చెరువులో మట్టిపోశారు. బఫర్ జోన్‌లో ప్లాట్లు చేసి విక్రయించారు. అదేవిధంగా డీసీపీ కార్యాలయం వెనకన ఉన్న కుంట ఆక్రమించారు. దాని కట్టు కాలువను రియల్టర్లు ఆక్రమించి ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారు. భువనగిరి కలెక్టరేట్ సమీపంలోని తిమ్మబాయి కుంట కబ్జాకు గురైంది. రాయిగిరి శివారులోని ఈ కుంటలో వెంచర్ చేశారు. హైడ్రా తరహా అమలుతో జిల్లాలో ఆక్రమణలు తొలగుతాయని ప్రజలు పేర్కొంటున్నారు.

వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే



మండల వైద్యాధికారితో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

చౌటుప్పల్ : సీజనల్ వ్యాధులపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే అన్నారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామంలో వైద్యశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఓపీ వివరాలతోపాటు మందుల స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇంటింటికీ ఫీవర్ సర్వే నిర్వహించాలని సూచించారు. ఫీవర్ సర్వేలో గుర్తించిన వారిని పీహెచ్‌సీలో రక్తపరీక్షలు నిర్వహించి అందుకు అనుగుణంగా వైద్య సాయం అందించాలని తెలిపారు. దోమల నివారణ చర్యలు చేపట్టాలన్నారు. గుంతల్లో మురుగునీరు నిల్వలు లేకుండా ప్రజలను చైతన్యం చేయాలని చెప్పారు. సీజనల్ వ్యాధులు నిర్మూలించేందుకు ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరనాయక్‌ను ఆదేశించారు. ఆయన వెంట మండల వైద్యాధికారి డాక్టర్ చింతకింది కాటంరాజు, వైద్యుడు సంపత్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలి



అంగన్‌వాడీ కేంద్రంలోని పాల ప్యాకెట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

చౌటుప్పల్ రూరల్: గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి పౌష్టికాహారం సద్వినియోగం చేసుకునేలా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే అన్నారు. మంగళవారం చౌటుప్పల్ మండలంలోని చింతలగూడెం గ్రామంలో ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో పాల ప్యాకెట్లను పరిశీలించారు. అనంతరం దామెర గ్రామంలో నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రమోద్‌కుమార్ తదితరులున్నారు.

పోషకాహార లోపాన్ని నివారించాలి



పోషణ మాసోత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ గంగాధర్

- అదనపు కలెక్టర్ గంగాధర్

భువనగిరిటౌన్: బాలింతలు, గర్భిణులు, పిల్లల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు కృషి చేయాలని అదనపు కలెక్టర్ గంగాధర్ అన్నారు. పోషణ మాసం, ఆహార పద్ధతులపై మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సీడీపీఓలు సూపర్‌వైజర్లు, హెల్త్ డిపార్ట్‌మెంట్ వైద్యాధికారులకు నిర్వహించిన ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 30వ తేదీ వరకు జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసం నిర్వహిస్తున్నందున పిల్లల బరువు, ఎత్తు నమోదు, వయసుకు తగిన బరువు, ఎత్తు లేని పిల్లలకు పర్యవేక్షణతో కూడిన ఆహారాన్ని అందిస్తూ వైద్య పరీక్షలు చేయించాలని తెలిపారు. తక్కువ బరువు ఉన్న పిల్లలకు ఆకలి పరీక్షలు నిర్వహించాలని, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇవ్వాలని చెప్పారు. సప్లిమెంటరీ సూపర్‌వైజరీ ఫీడింగ్ ప్రోగ్రాంలో నమోదు చేసి వారి ఆరోగ్యం పరీక్షిస్తుండాలని తెలిపారు. నమోదైన గర్భిణులు, బాలింతలకు ఇచ్చే రోజువారీ ఆహారాన్ని వారు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే తిని వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కృష్ణవేణి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ యశోధ, డాక్టర్ మనోహర్, డాక్టర్ శిల్పిని, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ వీణ తదితరులు పాల్గొన్నారు.

5,372 మంది రైతుల దరఖాస్తులు స్వీకరించాం

- జిల్లా వ్యవసాయాధికారి గోపాల్



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి గోపాల్

చౌటుప్పల్ : రుణమాఫీ జాబితాలో పేరు ఉన్నప్పటికీ రేషన్‌కార్డు లేని కారణంగా మాఫీ జరగని రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ముమ్మరంగా కొనసాగుతోందని జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ తెలిపారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తాళ్లసింగారం గ్రామంలో మంగళవారం నిర్వహించిన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా రేషన్‌కార్డులు లేని రైతులు 18,072 మంది ఉండగా ఇప్పటివరకు 5,372 మంది రైతుల దరఖాస్తుల స్వీకరణ పూర్తయిందని పేర్కొన్నారు. మిగిలిన రైతుల నుంచి కూడా దరఖాస్తుల స్వీకరణ వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి ముత్యాల నాగరాజు, ఏఈఓలు శంకరయ్య, లావణ్య, రైతులు ఉన్నారు.

డీఎస్సీ ఫలితాల కోసం ఎదురుచూపు

- గత నెల విడుదలైన ప్రాథమిక కీ
- నేటికీ ప్రకటించని ఫైనల్ కీ
- జిల్లాలో డీఎస్సీ రాసిన 1,900 మంది అభ్యర్థులు



భువనగిరి: డీఎస్సీ పరీక్ష రాసిన అభ్యర్థులు ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారు. జూలై 18 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఈ పరీక్షలు జరిగాయి. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత చాలా జాప్యం అనంతరం పరీక్షలు నిర్వహించడంతో సమారు 2250 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో సుమారు 1900 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. ఖాళీలు తక్కువగా ఉండటంతో పోటీ తీవ్రమైంది. గత నెల 13వ తేదీన ప్రాథమిక కీ ప్రకటించి 20వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరించారు. ఆగస్టు నెలాఖరు నాటికి తుది కీ ప్రకటించి ఫలితాలను తెలిపే విధంగా కసరత్తు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈమేరకు ప్రిలిమినరీ కీతో పాటు అభ్యర్థుల రెస్పాన్స్ షీట్లను ఇప్పటికే వెబ్‌సైట్‌లో ఉంచారు. కానీ ఇప్పటి వరకు ఫలితాలు ప్రకటించకపోవడంతో అభ్యర్థులకు ఎదురు చూపులు తప్పడం లేదు.

జిల్లాలో 220 ఖాళీలు

జిల్లాలో 712 ప్రభుత్వ పాఠశాలు ఉన్నాయి. ఇటీవల ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టింది. ఈ ప్రక్రియ ముగిసిన అనంతరం విద్యార్థులు ఉండి ఉపాధ్యాయులు లేని పాఠశాలల్లో సర్దుబాటు ప్రక్రియ చేపట్టారు. దీని ప్రకారం ఎస్జీటీలో సుమారు 120 మంది ఉండగా స్కూల్ అసిస్టెంట్లలో 122 మంది వరకు ఉన్నారు. బదిలీ అయిన వారి స్థానంలో ఎవరూ రాకపోవడంతో వారిని అదే స్థానంలో ఉంచాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ప్రక్రియ పూర్తి అయిన తర్వాత సుమారు జిల్లాలో 700 వరకు ఖాళీలు ఏర్పడగా ప్రభుత్వం మాత్రం 220 ఖాళీలను డీఎస్సీ ద్వారా భర్తీ చేసేందుకు ప్రకటించింది. ఇందులో 128 ఎస్జీటీలు కాగా 92 ఏస్ఏలు ఉన్నాయి. డీఎస్సీ ఫలితాలు ప్రకటిస్తే ఖాళీలను భర్తీ చేయడం ద్వారా కొంత వరకు ఉపాధ్యాయుల కొరత తీరనుంది.

ఫలితాలు ప్రకటించాలి



డీఎస్సీ పరీక్ష నిర్వహించి సుమారు నెల రోజులు అవుతోంది. ఆగస్టు నెలాఖరులో ఫలితాలను ప్రకటిస్తామని తెలిపారు. కానీ ఇప్పటి వరకు తుది కీ విడుదల చేయలేదు. వెంటనే తుది కీ ప్రకటించి ఫలితాలు ప్రకటించాలి.

– గీత, వలిగొండ

గృహిణికి సైబర్ నేరగాళ్ల టోకరా

- ఉద్యోగం ఇప్పిస్తామని రూ.70వేలు కాజేసిన వైనం

చౌటుప్పల్: ఉద్యోగం ఇప్పిస్తామని గృహిణికి సైబర్ నేరగాళ్లు రూ.70వేలు టోకరా పెట్టారు. ఈ ఘటన చౌటుప్పల్ పట్టణంలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన భార్యాభర్తలు చౌటుప్పల్ పట్టణంలోని హనుమాన్‌నగర్ కాలనీలో నివాసముంటున్నారు. భార్య గృహిణి కాగా.. భర్త స్థానికంగా ఓ ప్రైవేట్ పరిశ్రమలో ఉగ్యోగం చేస్తున్నాడు. ఇటీవల భర్త ఉద్యోగానికి వెళ్లగా సదరు గృహిణి ఇంట్లోనే ఉంది. ఈ క్రమంలో ఆమె వాట్సాప్‌కు గుర్తుతెలియని నంబర్ నుంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి, కావాల్సినవారు సంప్రదించాలంటూ మెసేజ్ వచ్చింది. ఉద్యోగం చేయాలని భావించిన సదరు గృహిణి తనకు వచ్చిన మెసేజ్‌ను ఓపెన్ చేసింది. పలు రకాల చార్జీల పేరిట ఆమె అకౌంట్ నుంచి సైబర్ నేరగాళ్లు డబ్బులు తీసుకున్నారు. అలా విడతలవారీగా ఆమె వద్ద నుంచి రూ.70వేలు వసూలు చేశారు. చివరకు తాను మోసపోయానని గ్రహించిన సదరు గృహిణి మంగళవారం భర్తతో కలిసి చౌటుప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

ఖాళీ బిందెలతో మహిళల నిరసన



బూర్గుపల్లి గ్రామంలో ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

రాజాపేట: మండలంలోని బూర్గుపల్లి గ్రామంలో మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో మంగళవారం గ్రామంలోని మహిళలు గ్రామ పంచాయతీ వద్ద ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. మూడు రోజుల నుంచి నీరు రావడంలేదని, గ్రామ పంచాయతీ అధికారులకు తెలిపినా ప్రయోజనంలేకుండా పోయిందని మహిళలు వాపోయారు. ఈ విషయం తెలుసుకున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కరుణాకర్ గ్రామానికి చేరుకుని మిషన్ భగీరథ నీటి నమూనాలు సేకరించారు. ఇంటింటికి తిరిగి ప్రజలను సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యదర్శి జ్యోతిని అడిగి నీరు ఎందుకు రావడం లేదని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీఓ ఆవుల కిషన్ ఉన్నారు.

ఐదుగురు డిప్యూటీ తహసీల్దార్లకు పదోన్నతి

భువనగిరిటౌన్: వివిధ మండలాల్లో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న పలువురికి తహసీల్దార్‌గా పదోన్నతి ఇస్తున్నట్లు ల్యాండ్ అడ్మినిస్ట్రేటివ్ కమిషనర్ నవీన్ మిట్టల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఐదుగురు పదోన్నతి పొందగా.. వారిని ఇతర జిల్లాలకు కేటాయించారు. డి.శ్రీనివాస్ సూర్యాపేట, గులాం ఇద్రిస్ మేడ్చల్ మాల్కాజ్‌గిరి, బీరెడ్డి రాజేష్ మేడ్చల్ మల్కాజ్‌గిరి, రామాకాంత్‌శర్మ నల్లగొండ, కేవీ రామాంజుచారి జనగాంకు పదోన్నతిపై వెళ్లనున్నారు.

వరద బాధితులను ఆదుకుంటాం

- రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



హుజూర్‌నగర్‌లో డ్రెయినేజీని పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మఠంపల్లి: భారీ వర్షాలకు వరదల కారణంగా నష్టపోయిన బాధితులను ఆదుకుంటామని రాష్ట్ర భారీ నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లాలోని మఠంపల్లి మండలంలో వర్షానికి దెబ్బతిన్న పలు గ్రామాలను ఆయన సందర్శించారు. చౌటపల్లి వద్ద తెగిన చెరువు కట్ట, కొట్టుకుపోయిన మేళ్లచెరువు–చౌటపల్లి రహదారి, మఠంపల్లి వద్ద తెగిన మామిళ్లచెరువు కట్ట, రఘునాథపాలెం ఊరవాగులో మునిగిన ఇళ్లు, రహదారి, వరదాపురం, చెన్నాయిపాలెం గ్రామాల వద్ద కొట్టుకుపోయిన అలింగాపూర్ రోడ్డు, వేములూరు వాగు వరద నీటలో మునిగిన పంట పొలాలు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎకరాకు రూ.10వేలు, కూలిన ఇళ్లకు ఇందిరమ్మ ఇల్లు, మృతిచెందిన పశువులకు రూ.50 వేలు, మేకలకు రూ.5వేల చొప్పున ప్రభుత్వం ఆర్థికసాయం అందజేసి ఆదుకుంటుందని తెలిపారు. ఇళ్లలోకి నీరు వెళ్లినవారికి కూడా రూ.10వేల పరిహారం ఇస్తామన్నారు. గుండ్లపల్లి ఎత్తిపోతల నుంచి నిత్యం నీరు విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. మఠంపల్లి సమీపంలో రైల్వే లైను కట్టకు ఖానాలు లేకపోవడంతో వరద నీరు దళితుల ఇళ్లలోకి చేరిందని పేర్కొన్నారు. వారందరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంజీనాయక్, పీఏసీఎస్ చైర్మన్, వైస్‌చైర్మన్‌లు రామచంద్రయ్య, బాబునాయ్, ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ మంగా, సీఐ చరమందరాజు, ఇరిగేషన్ అధికారులు, నాయకులు కిశోర్‌రెడ్డి, అరుణ, సైదులు, బ్రహ్మారెడ్డి, బాబు, ఎల్లారెడ్డి, సక్రు, రాంరెడ్డి పాల్గొన్నారు.

ఇరిగేషన్ ఏఈని సస్పెండ్ చేయాలని ఆదేశం



అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న మంత్రి

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో వరద ముంపునకు కారణమైన ఇరిగేషన్ ఏఈ శ్రీనివాస్‌ను సస్పెండ్ చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో వర్షానికి దెబ్బతిన్న ఇళ్లను, ఊరచెరువు తదితర ప్రాంతాలను మంగళవారం ఆయన పరిశీలించి బాధిత ప్రజలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ సీఈ రమేష్ బాబుతో మంత్రి ఫోన్‌లో మాట్లాడారు. ట్యాంక్‌బండ్‌ను తప్పుడు ప్రణాళికతో నిర్మించి వరద ముంపునకు కారణమైన ఏఈ శ్రీనివాస్‌ను సస్పెండ్ చేయాలని ఆదేశించారు. అదేవిధంగా వరదలతో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో తడిచిన ఎరువుల బస్తాలు, మట్టంపల్లి బైపాస్ రోడ్డు జంక్షన్‌లో దెబ్బతిన్న రోడ్లను పరిశీలించారు.

క్లుప్తంగా

పాలిటెక్నిక్ సీట్ల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

గరిడేపల్లి: శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయానికి అనుబంధంగా గరిడేపల్లి మండల గడ్డిపల్లిలో గల డాక్టర్ ఘంటా గోపాల్‌రెడ్డి హార్టికల్చర్ పాలిటెక్నికల్ కళాశాలలో మిగిలిన సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బండి వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల వారు 10వ తరగతి మార్కుల మెమో, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, దరఖాస్తు ఫారంతో నేరుగా గడ్డిపల్లిలోని కళాశాలలో సమర్పించాలని సూచించారు.

మోహన్‌రావు కుటుంబాన్ని ఆదుకుంటాం

- కోదాడ ఎమ్మెల్యే పద్మావతి


కూలిన మోహన్‌రావు ఇంటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

చిలుకూరు: మండలంలోని నారాయణపురం గ్రామంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో మంగళవారం కోదాడ ఎమ్మెల్యే పద్మావతి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ పరిధిలోని ఊర చెరువు కట్ట తెగడంతో కూలిపోయిన మోహన్‌రావు ఇంటిని ఆమె పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మోహన్‌రావు కుటుంబాన్ని ఆదుకుంటామని అన్నారు. ప్రభుత్వం చేయూతనిస్తుందని భరోసానిచ్చారు. ఎమ్మెల్యే ముందు మోహన్‌రావు కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు.


బస్సులో గుండెపోటుతో మహిళ మృతి


మృతిచెందిన యాదమ్మ

అర్వపల్లి: గుండె నొప్పితో ఆస్పత్రికి చికిత్స కోసం బస్సులో వెళ్తూ ఓ మహిళ మార్గమధ్యలోనే మృతిచెందింది. సూర్యాపేట జిల్లా నాగారం మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన జటంగి అవిలయ్య భార్య యాదమ్మ(60)కు మంగళవారం ఉదయం గుండెనొప్పి వచ్చింది. కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే ఆర్టీసీ బస్సు ఎక్కించి సూర్యాపేటకు బయలుదేరారు. అర్వపల్లి శివారుకు వచ్చాక గుండె నొప్పి ఎక్కువై బస్సులోనే యాదమ్మ మృతిచెందింది. ఆర్టీసీ బస్సు సిబ్బంది తమ ఉన్నతాధికారులకు, స్థానిక పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్‌ఐ సీహెచ్.బాలకృష్ణ సంఘటనా స్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తుంగతుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సీపీఆర్ చేసి ఉంటే..

యాదమ్మకు గుండెనొప్పి రాగా కుటుంబీకులు సూర్యాపేటకు చికిత్స కోసం ఆసుపత్రికి బస్సులో తీసుకెళుతున్నారు. ఆమెకు నొప్పి ఎక్కువై ఇబ్బంది పడింది. ఈ సమయంలో ఆమెకు సీపీఆర్ చేసి ఉంటే ప్రాణాలతో బయట పడేదని పలువురు అన్నారు. సీపీఆర్‌పై కుటుంబీకులకు అవగాహన లేకపోవడం, బస్సు వెళుతున్న క్రమంలో ప్రయాణీకులు కూడా దృష్టి పెట్టక పోవడం మూలంగా యాదమ్మ ప్రాణాలొదిలింది.


తుంగతుర్తి: మానాపురంలో దెబ్బతిన్న రోడ్డును పరిశీలిస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులు


మఠంపల్లి మండలం కిందితండా సమీపంలో ఇసుక మేటలతో నిండిన పంటపొలాలు


హుజూర్‌నగర్‌రూరల్: బూరుగడ్డ గ్రామంలో వరద ఉధృతికి పంట పొలాల్లో చేరిన రాళ్లు


మద్దిరాల: పోలుమల్ల శివారులో 365వ నంబర్ జాతీయ రహదారి సమీపంలో వరద నీటితో నిండిన పొలాలు


నడిగూడెం మండలం కాగితరామచంద్రపురం గ్రామ సమీపంలో వరదలకు పంట పొలాల్లో ఇసుకమేటలు

కింది చిత్రంలో కనబడుతున్న వారు సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సుందరయ్యనగర్‌లో నివాసముండే మంద ఉపేందర్ దంపతులు. వీరు గత కొన్నేళ్లుగా ఇక్కడే నివాసముంటున్నారు. మూడు రోజులుగా కురిసిన భారీ వర్షానికి వారి ఇంటి పక్కనే ఉన్న ఓ కంపెనీకి చెందిన ప్రహరీ కూలి వీరి ఇంటిపై పడింది. దీంతో ఇల్లు సగం వరకు ధ్వంసమైంది. ఇంట్లో ఉన్న వారికి గాయాలయ్యాయి. మూడు రోజులుగా వారి ఇంటి పక్కన మరో ఇంట్లో ఉంటున్నారు. సామాన్లు అన్నీ ధ్వంసమయ్యాయి. రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబం కావడంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. – సూర్యాపేటటౌన్


ఇంట్లో సామాన్లు బయటకు తీసుకెళ్తున్న మంద ఉపేందర్


పాలకవీడు: వేములూరు వాగు ఉధృతికి కొట్టుకుపోయిన శ్మశానవాటిక


మఠంపల్లి సమీపంలో తెగిన మామిళ్ల చెరువు కట్టను పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్, నాయకులు


కాగితరామచంద్రాపురం సమీపంలో సాగర్ ఎడమ కాల్వ తెగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి తదితరులు


ఎస్కేప్ ఛానల్‌ను పరిశీలిస్తున్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, సబితారెడ్డి


డిండి: డిండి వాగులో చిక్కుకుని సురక్షితంగా బయటకు వచ్చిన చెంచులతో దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్, పోలీసులు, నాయకులు


వేములపల్లి మండలం అన్నపరెడ్డిగూడెం ఎల్-11 తూము వద్ద ఎడమ కాల్వ కట్ట పరిస్థితి ఇది..


నిడమనూరు మండలం ముప్పారం సమీపంలో బలహీనంగా ఉన్న ఎడమ కాల్వ కట్ట


గరిడేపల్లి: వెలిదండ వద్ద కోతకు గురైన సాగర్ ఎడమ కాల్వ కట్ట


మిర్యాలగూడ మండలం కురియాతండా వద్ద దెబ్బతిన్న ఎడమ కాల్వ లైనింగ్


వేములపల్లి మండలం అన్నపరెడ్డిగూడెం ఎల్-12 తూము వద్ద కోతకు గురైన ఎడమ కాల్వ


నిడమనూరు మండలంలోని ముప్పారం బ్రిడ్జి సమీపంలో ప్రమాదకరంగా సాగర్ ఎడమ కాల్వ కట్ట

దెబ్బతిన్న రోడ్లు, వంతెన


దెబ్బతిన్న సూర్యాపేట-ఖమ్మం జిల్లాల సరిహద్దు వంతెన

నడిగూడెం: మండల పరిధిలోని కాగితరామచంద్రాపురం వద్ద సాగర్ ఎడమ కాల్వ కట్ట రెండు చోట్ల తెగడంతో ప్రవహించిన వరద నీటికి రైతుల పొలాలకు వెళ్లే రహదారులు పలు చోట్ల పూర్తిగా దెబ్బతిన్నాయి. దాదాపు 50కి పైగా విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. అదేవిధంగా కాగితరామచంద్రాపురం నుంచి ఖమ్మం జిల్లా సరిహద్దు గ్రామమైన మందడినర్సయ్యగూడెం వద్ద ఉన్న వంతెన దెబ్బతింది. దీంతో ప్రజల రాకపోకలు నిలిచాయి. సంబంధిత అధికారులు వంతెనకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

తహసీల్ కార్యాలయ స్థలం వేలానికి కోర్టు ఉత్తర్వులు

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలోని వంద గజాల ఖాళీ స్థలాన్ని బహిరంగ వేలంలో విక్రయించుటకు స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి జట్టా శ్యాంకుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. హుజూర్‌నగర్ మండలంలోని వేపల సింగారం గ్రామానికి మూడెల రాయపురెడ్డి, చక్కెర రోషమ్మకు చెందిన ఆ భూమిని 1985లో అప్పటి ప్రభుత్వం నిరుపేదలకు ఇళ్ల నిర్మించేందుకు సేకరించింది. అప్పట్లో ఎకరం రూ.10వేల చొప్పున ధర నిర్ణయించగా.. దానిని వ్యతిరేకిస్తూ సదరు రైతులు కోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు ఎకరానికి రూ.17,500 నష్టపరిహారంతో పాటు వడ్డీ కలిపి చెల్లించాలని న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ హుజూర్‌నగర్ తహసీల్దార్ హైకోర్టులో అప్పీల్ చేయగా హైకోర్టు అప్పీల్‌ను కొట్టివేసింది. తమకు రావలసిన పరిహారం కోసం రైతులు కోర్టు ఆశ్రయించగా.. తహసీల్దార్ కార్యాలయంలోని 100గజాల ఖాళీ స్థలాన్ని బహిరంగ వేలంలో విక్రయించేందుకు న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు.

జోలె కట్టి ప్రాణాలు కాపాడారు


కుటుంబరావును జోలెలో కూర్చోబెట్టి బంధం వాగు దాటిస్తున్న యువకులు

- తేలు కుట్టిన వ్యక్తిని బంధం వాగు దాటించిన యువకులు

తుంగతుర్తి: తేలు కుట్టి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తిని గ్రామస్తులు జోలె కట్టి ఆస్పత్రికి తరలించి ప్రాణాలు కాపాడారు. తుంగతుర్తి మండలం కేశవాపురం గ్రామానికి చెందిన పడిశాల కుటుంబరావు మంగళవారం తన వ్యవసాయ క్షేత్రంలో వరద నీటికి తెగిన వరాలకు గండ్లు కట్టడానికి వెళ్లాడు. గండ్లు కడుతుండగా అతడిని తేలు కుట్టింది. విషయాన్ని గ్రామస్తులకు ఫోన్ చేసి చెప్పగా.. గ్రామానికి చెందిన యువకులు పొలం దగ్గరకు వెళ్లి కుటుంబరావును ఆస్పత్రికి తీసుకెళ్లేందుంకు ప్రయత్నించగా.. కేశవాపురం–వెలుగుపల్లి మధ్యలో బంధం వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో యువకులు జోలె కట్టి కుటుంబరావును వాగును దాటించారు. వెలుగుపల్లి నుంచి ఆటోలో తుంగతుర్తి ఆస్పత్రికి తీసుకెళ్లారు. కుటుంబరావు క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

పాలేరు వంతెనపై రాకపోకల పునరుద్ధరణ

- రెండు వైపులా వెళ్లే వాహనాలను ఒకే రూట్‌లో పంపిస్తున్న అధికారులు


పాలేరు వంతెనపై రాకపోకలు సాగిస్తున్న వాహనాలు

కోదాడ రూరల్ : తెలంగాణ, ఏపీ సరిహద్దులోని హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై రామాపురం క్రాస్‌రోడ్ వద్ద పాలేరు వాగు వంతెనపై అధికారులు రాకపోకలను పునరుద్ధరించారు. సోమవారం ఉదయం వంతెన తెగిపోవడంతో అధికారులు రాకపోకలు నిలిపివేశారు. అయితే, వాగు ఉధృతి తగ్గడంతో సోమవారం రాత్రి నుంచి కొత్త బ్రిడ్జిపై నుంచి వాహనాలను అనుమతించారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనాలను, విజయవాడ నుంచి హైదరాబాద్ వచ్చే వాహనాలను ఒకే రూట్‌లో పంపిస్తున్నారు. వాహనాలు ఒకే మార్గంలో వస్తూ హైదరాబాద్ వైపు వచ్చేవి రామాపురం క్రాస్‌రోడ్ వద్ద, విజయవాడ వైపు వెళ్లేవి గరికపాడు చెక్‌పోస్ట్ వద్ద దారిమళ్లి రెండు మార్గాల్లో యాధావిధిగా ప్రయాణిస్తున్నాయి. ఏపీ వైపు 20 మీటర్ల మేర కోతకు గురైన పాత బ్రిడ్జి పనులను అధికారులు ప్రారంభించారు. మరో రెండు రోజుల్లో ఆ పనులను పూర్తి చేసి వాహనాలను అనుమతించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

మొన్న అలా..



నేడు ఇలా..


కోదాడ పట్టణ పరిధిలోని పెద్దచెరువు వరదకు శనివారం షిర్డిసాయినగర్ మునిగిపోవడంతో పడవల ద్వారా స్థానికులను ఇళ్ల నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మంగళవారం వరద తగ్గడంతో షిర్డిసాయినగర్‌లోని ఇళ్లు నీటి నుంచి బయటపడ్డాయి. – కోదాడ